www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 10 జూన్ 2023

5

ఏలూరు

గురుకులానికి ఎంపిపి కుమారుడు ఎంపిక

ప్రజాశక్తి - టి.నరసాపురం

అప్పలరాజుగూడెం బాలుర గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో ప్రవేశానికి మండలంలోని లంకాలపల్లికి చెందిన ఎంపిపి దారబోయిన లక్ష్మి, వెంకటేశ్వరావు దంపతుల కుమారుడు దారబోయిన చెర్రి ఎంపికైనట్లు శుక్రవారం విలేకరులకు తెలిపారు. గత నెలలో ప్రవేశ పరీక్ష రాయగా శుక్రవారం వెలువడిన ఫలితాల్లో చెర్రికి 53 మార్కులు లభించి ప్రవేశం పొందారని తెలిపారు. మండలంలోని పుట్రేపునకు చెందిన కాటిక సుప్రియ 64 మార్కులు సాధించి చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెం బాలికల గురుకుల పాఠశాలల్లో ప్రవేశం పొందారు.

పెట్టుబడి బారెడు.. ధర బెత్తెడు..!

వరికి మద్దతు ధర పెంపులో మోడీ సర్కార్ దగా

2023-24కు క్వింటాల్‌కు రూ.143 పెంపు

రైతుకు దక్కేది క్వింటాల్‌కు రూ.2,183 మాత్రమే

పెట్టుబడికి 50 శాతం కలిపితే ఇవ్వాల్సిన ధర రూ .2,707

ధరలో దగాతో అన్నదాతకు అప్పులే శరణ్యం

కేరళలో క్వింటాల్ ధాన్యంకు రూ.780 బోనస్.. మన రాష్ట్రంలో మాత్రం శూన్యం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 2023-24కు సంబంధించి వరి పంటకు మద్దతు ధర పెంపుపై రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పెట్టుబడికి.. మద్దతు ధరకు సంబంధం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్రం ప్రకటించిన మద్దతు ధర రైతులకు ఏమాత్రం ప్రయోజనం చేకూరే విధంగా లేని పరిస్థితి నెలకొంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రధానమైన పంటల్లో వరికి అగ్రస్థానం ఉంది. ఖరీఫ్, రబీలో కలిపి పది లక్షలకుపైగా ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. ముఖ్యంగా డెల్టాలో వరి తప్ప రైతులకు వేరే ప్రత్యామ్నాయం సైతం లేని పరిస్థితి ఉంది. రైతులకు మద్దతు ధర అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దగా చేస్తుండటంతో ఏయేటికాయేడు అన్నదాత అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాడు. ప్రతియేటా కేంద్ర ప్రభుత్వం ప్రకటించే మద్దతు ధర కంటితుడుపు చర్యగా మారాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2023-24కు సంబంధించి వరికి క్వింటాల్‌కు రూ.143 పెంచుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. దీంతో మొన్నటి వరకూ క్వింటాల్ వరికి రూ.2040 ఉండే ధర ఇప్పుడు రూ.2,183కే చేరింది. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల మేరకు పెట్టుబడి ఖర్చుకు అదనంగా 50 శాతం కలిపి మద్దతు ధర రైతులకు అందించాలి. ఆ విధంగా రైతులకు ధర అందాలంటే ప్రభుత్వం క్వింటాల్ వరికి రూ.2,707 ధర ఇవ్వాల్సి ఉంది. అయితే కేంద్రం ఆ విధంగా చేయకుండా తూతూమంత్రంగా ధర ప్రకటించింది. దీంతో రైతులు క్వింటాల్‌కు ధర రూపంలో రూ.524 నష్టపోతున్న పరిస్థితి నెలకొంది. కేంద్ర ప్రభుత్వం రైతుల గురించి ఏమాత్రం ఆలోచించడం లేదని, ప్రస్తుతం పంటలకు ప్రకటించిన ధరలను చూస్తే అర్థమవుతోంది. వాస్తవ ధరలను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకుండా తాము ప్రకటించిన ధరనే మద్దతు ధర అన్నట్లు కేంద్రం వాదిస్తున్న పరిస్థితి నెలకొంది.

ఎరువుల, పురుగు మందుల ధరలు పైపైకి

మోడీ అధికారంలోకొచ్చాక ఎరువులు, పురుగుమందులు, పెట్రోల్, డీజిల్ వంటి ధరలు ఆకాశాన్నంటాయి. దీంతో వ్యవసాయ పెట్టుబడులు పెద్దఎత్తున పెరిగిపోయాయి. ప్రస్తుతం 20-20-0 ఎరువు బస్తా ఖరీదు రూ.1700కు చేరగా, 28-28-0 ఎరువు ధర సైతం రూ.1700 పలుకుతోంది. 14-35-14, 10-26-26, పోటాస్ వంటి ధరలు సైతం బస్తా రూ.1700కు చేరాయి. డిఎపి బస్తా రూ.1350 వరకూ విక్రయిస్తున్నారు. డీజిల్ ధరల పెరుగుదలతో దుక్కుల ధరలు పెద్దఎత్తున పెరిగిపోయాయి. గతంలో సాలుకు రూ.600 ఉండగా ఇప్పుడు సాలుకు రూ.1200కుపైగా చేరింది. కిరాయి ధరలు గతంలో బస్తాకు రూ.పది ఉంటే ఇప్పుడు రూ.20 వరకూ వసూలు చేస్తున్న పరిస్థితి నెలకొంది. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా కూలి రేట్లు సైతం పెరిగాయి. దీంతో ఎకరా సాగుకు రబీలో దాదాపు రూ.49 వేలు వరకూ పెట్టుబడి ఖర్చవుతున్న పరిస్థితి నెలకొంది.

వరిసాగులో రైతుకు మిగులేది..?

ప్రస్తుత ధరల ప్రకారం ఎకరా వరిసాగుకు రూ.49 వేలు వరకూ ఖర్చవుతోంది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం 75 కిలోల బస్తాకు రూ.1637గా ధర నిర్ణయం కానుంది. ఎకరాకు రబీలో సరాసరిన 45 బస్తాల దిగుబడి వస్తోంది. ప్రభుత్వం ప్రకటించిన ధర ప్రకారం రూ.73,665 ఆదాయం వస్తోంది. దీనిలో 15 బస్తాల కౌలు సొమ్ము రూ.24,555 భూయజమానికి చెల్లించాలి. ఇంకా పండిన పంటలో మిగిలే సొమ్ము రూ.49,110 మాత్రమే. పెట్టుబడికి వడ్డీ కలుపుకుంటే రైతుకు అప్పులే శరణ్యమన్నట్లు వరిసాగు తయారైంది. ఎకరాకు 40 బస్తాల దిగుబడి వస్తే భారీగా రైతులు నష్టపోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇదంతా ప్రభుత్వం ప్రకటించిన ధర వస్తేనే ప్రకృతి వైపరీత్యాలు, దళారుల వ్యవస్థ కారణంగా రైతులకు ప్రభుత్వం ప్రకటించిన ధర ఎక్కడా సవ్యంగా అందడం లేదు. దీంతో రైతు ఆరుగాలం కష్టపడినా వరిసాగులో మిగులనేది లేకుండాపోతోంది. వాస్తవ ఖర్చులను, క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకుండా కేంద్రం మద్దతు ధరను తూతూమంత్రంగా పెంచేసి చేతులు దులుపుకుంటున్న పరిస్థితి నెలకొంది. కేంద్రం ప్రకటించిన ధరతో వరిరైతులు తీవ్రనష్టాల్లో కూరుకుపోవడంతో కేరళలోని వామపక్ష ప్రభుత్వం క్వింటాల్‌కు బోనస్‌గా రూ.780 ఇస్తోంది. మన రాష్ట్రంలో మాత్రం వరి రైతులకు బోనస్ అనేది లేకుండాపోవడంతో రైతుల అప్పుల ఊబిలో కూరుకుపోతున్న పరిస్థితి నెలకొంది.

ఉత్పత్తి ఖర్చులకు అనుగుణంగా ధర పెంపు లేదు

కె.శ్రీనివాస్, రైతుసంఘం జిల్లా కార్యదర్శి

కేంద్రం వరికి ప్రకటించిన ధర పెంపు ఉత్పత్తి ఖర్చులకు అనుగుణంగా లేకుండాపోయింది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోనున్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ఆధారంగా మద్దతు ధర ప్రకటించాలి. వాస్తవ ఖర్చులను పరిగణనలోకి తీసుకోకుండా కేంద్రం ధర ప్రకటిస్తోంది. పురుగుమందులు, ఎరువులు, దుక్కుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. మద్దతు ధర గ్యారెంటీ చట్టం తెచ్చినప్పుడే రైతులకు మేలు జరుగుతుంది.

ఎకరాకు పెట్టుబడి ఖర్చు ఇలా	రూపాయల్లో..
1.ఆకుమడి, విత్తనాలు, ఎరువులు	1500.00
2.దుక్కుకి	3,600.00
3.లంకలు బాగుచేతకు	1,000.00
4.ఊడ్పులకు, ఆకుతీతకు	4,700.00
5.కలుపుమందుకు, చల్లినందుకు కూలి	1,200.00
6.కలుపుతీతకు, గడ్డికోతకు	1,000.00
7.ఎరువులు రెండు కోటాలకు	5,000.00
8.చిరుపొట్ట దశలో పొటాష్, గుళికలు	1,200.00
9.పురుగుమందులు నాలుగుసార్లకు	11,000.00
10.ఎలుకల నివారణకు	500.00
11.కోతమిషన్, ట్రాక్టరుకు	6,000.00
12.ధాన్యం ఆరబోతకు, పట్టుబడికి	2,000.00

సార్వాకు అయ్యే ఖర్చు మొత్తం:	రూ.38,700

దాళ్వాకు ఎరువులు, ఇతర ఖర్చులు అదనంగా మరో రూ.10 వేలు కలుపుకుంటే దాళ్వాసాగుకు అయ్యే ఖర్చు మొత్తం: రూ.48,700

అభివృద్ధి పనుల్లో

అలసత్వం వహిస్తే సహించేది లేదు

పాఠశాలలు తెరిచేనాటికి నాడు-నేడు పనులు పూర్తి చేయాలి

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - చాట్రాయి

అభివృద్ధి పనుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ స్పష్టం చేశారు. శుక్రవారం మండలంలో ఆయన నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్ష్ రాజేంద్రన్‌తో కలిసి సుడిగాలి పర్యటన చేశారు. అభివృద్ధి పనులను పరిశీలించారు. పనులు నిర్ధిష్టకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మండలంలోని పోలవరం గ్రామంలో ఎంపీ నిధులతో నిర్మించిన బహుళార్థకసాధక భవనాన్ని పరిశీలించారు. ఎలక్ట్రికల్ పనులు నిర్వహించకపోవడంపై సంబంధిత పంచాయతీరాజ్ ఎఇ, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం చాట్రాయిలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నాడు-నేడు కింద చేపట్టిన ఆధునికీకరణ పనులను కలెక్టర్ తనిఖీచేశారు. అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల తెరిచే నాటికి తప్పనిసరిగా పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల పక్కనే ఉన్న శిథిల భవనాన్ని తొలగించాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. నరహింహరావుపాలెంలో గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. జగనన్న కాలనీకి సంబంధించిన పనుల పురోగతిపై ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. చనుబండలో అమృత సరోవర్ పథకం ద్వారా చేపట్టిన చెరువును కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో తహశీల్దార్ సిహెచ్.విశ్వనాథరావు, ఎంపిడిఒ కె.దుర్గాప్రసాద్, ఎపిఒ జి.లక్ష్మీకుమారి, ఇఒపిఆర్‌డి నాగరాజు, సర్పంచి జ్యోతి, స్టేట్ కోఆపరేటివ్ యూనియన్ ఛైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు జి.రాము, ఎంపిడిఒ కార్యాలయ ఎఒ ఎన్.మురళీమోహన్ పాల్గొన్నారు.



సచివాలయంలో లబ్ధిదారుల వివరాలను పరిశీలిస్తున్న కలెక్టర్

ట్రిపుల్ ఐటిలో ప్రవేశానికి 14,256 దరఖాస్తులు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయ పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, శ్రీకాకుళం, ఒంగోలు ట్రిపుల్ ఐటిల్లో ప్రవేశాలకు ఈ నెల 4 నుండి 26వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని నోటిఫికేషన్ జారీ చేసిన సంగతి తెలిసిందే. అయితే తొమ్మిదో తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు 14,256 దరఖాస్తులు అందినట్లు ఆర్‌జియూకెటి ప్రవేశాల కన్వీనర్ గోపాలరాజు ఒక ప్రకటనలో తెలిపారు.

క్రీడాస్టేడియం నిర్మాణానికి ప్రతిపాదనలు

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

క్రీడారంగ అభివద్ధిలో భాగంగా నూజివీడులో క్రీడా స్టేడియం నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేసి పంపాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల సమీపంలో క్రీడా స్థలాన్ని స్టేడియంగా నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించడానికి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. స్టేడియంకు సంబంధించిన ప్రహరీ, హద్దులు తదితర సమాచారాన్ని మ్యాప్ ద్వారా తహశీల్దార్ డివిఎస్.యల్లారావు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం మామిడి పరిశోధనా కేంద్రం పక్కనే ఉన్న 40 ఎకరాల ప్రయివేటు భూమిని మధ్యతరగతి ప్రజలకు స్థలాలు కేటాయించడానికి కొనుగోలు చేసిన స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. అనంతరం సిద్ధార్థనగర్‌లో కొండపై శిథిలమై ఉన్న రెవెన్యూ విశ్రాంతి భవనాన్ని కలెక్టర్ పరిశీలించి ఈ భవనాన్ని పునఃప్రారంభానికి ప్రతిపాదనలు రూపొందించి చర్యలు తీసుకోవాలని నూజివీడు సబ్ కలెక్టర్‌కు సూచించారు. కొండపై సాగు చేసుకుంటున్న రైతులతో సాగుభూమి పట్టాల గురించి, ఫలసాయం గురించి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఖాన్, ఆర్ఐ అశోక్‌కుమార్, విఆర్ఒ రాజబాబు పాల్గొన్నారు.

స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

ధర్నా చేస్తున్న గ్రామస్తులు

విద్యుత్ కోతలు నిరసిస్తూ ధర్నా

ప్రజాశక్తి - చింతలపూడి

తరచూ విద్యుత్ కోతలు విధించడాన్ని నిరసిస్తూ వెలంపేటప్రజలు చింతలపూడి సబ్‌స్టేషన్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. మూడు రోజులుగా అప్రకటిత విద్యుత్ కోతలు విధిస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఉక్కబోతతో జనం అల్లాడుతున్నారని, చిన్నపిల్లలు, గర్భిణులు నానాఅవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం రాత్రి ఎన్‌విఎన్ కాలనీ ప్రజలు విద్యుత్ కోతలను నిరసిస్తూ రోడ్డుపై బైఠాయించడంతో పోలీసులు వచ్చి సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు. వెలంపేటలోనూ ఇదే పరిస్థితి నెలకొనడంతో ఆందోళన చేపట్టారు. ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ కోతలు లేకుండా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరారు.

అభివాదం చేస్తున్న నేతలు

దూదేకులకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలి

నూర్‌బాష దూదేకుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పీర్‌మహ్మద్

ప్రజాశక్తి - ఏలూరు

చట్ట సభల్లో నూర్‌బాష దూదేకులకు ప్రాతినిధ్యం కల్పించాలని నూర్‌బాష దూదేకుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.పీర్ మహ్మద్ డిమాండ్ చేశారు. ఏలూరులోని ప్రశాంతి రియల్ ఎస్టేట్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో పీర్ మహ్మద్ మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ళు గడుస్తున్నా ఇప్పటివరకూ ప్రతిపక్షంగానీ, అధికార పార్టీ గానీ చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 18 నుండి 22 లక్షల మంది వరకూ నూర్‌బాష దూదేకుల ప్రజలున్నారని వివరించారు. తమ డిమాండ్ల సాధనకోసం జూలై రెండో తేదీన గుంటూరులో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని చెప్పారు. అదేవిధంగా ప్రతి జిల్లాలోనూ సమావేశాలు నిర్వహించి తమ సత్తా చాటుతామని పీర్ మహ్మద్ చెప్పారు. తమకు చట్టసభల్లో ఎవరైతే అవకాశం కల్పిస్తారో వారికే మద్దతిచ్చి వెన్నంటి నడుస్తామని స్పష్టం చేశారు. సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు, ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గ కోఆప్షన్ సభ్యులు ఎస్‌ఎంఆర్ పెదబాబు మాట్లాడుతూ తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ సిఎం జగన్‌ను నేరుగా కలిసి విజ్ఞప్తి చేస్తామన్నారు. తమ నూర్‌బాషాలకు అందాల్సిన ప్రతి రాయితీ వచ్చేలా పోరాడుతామని చెప్పారు. పార్టీలకు అతీతంగా త్వరలో 15 వేల మందికిపైగా ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తామన్నారు. సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు డి.మస్తానమ్మ మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టిల కంటే తమ దుస్థితి దయనీయంగా ఉందన్నారు. మైనార్టీలకు వచ్చే రాయితీలుగానీ, బిసిలకు అందుతున్న లబ్ధి తమకు అందడం లేదన్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.సలీం, గుంటూరు జిల్లా కమిటీ అధ్యక్షులు కె.మహ్మద్ ఖాజావలి, తిరుపతి జిల్లా అధ్యక్షులు కరీముల్లా వలి, పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షులు సిద్ధయ్య, గుంటూరు జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి షేక్ నాగూర్, రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షులు బాజీసైదా, పశ్చిమ గోదావరి జిల్లా యువజన సంఘం అధ్యక్షులు షేక్ మహ్మద్‌రఫీ పాల్గొన్నారు.

అక్రమ తవ్వకాలను అడ్డుకోండి : వ్యకాస

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మట్టి, చెరువుల అక్రమ తవ్వకాలు ఆపాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. శుక్రవారం స్థానిక అన్నే వెంకటేశ్వరరావు భవనంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ కలిదిండి మండలం సీతారామఅగ్రహారం గ్రామంలో ఏడు ఎకరాల తాగునీటి చెరువు పక్కన చేపల చెరువు తవ్వి నీటి కాలుష్యానికి వడిగడుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికే డెల్టా ప్రాంతంలో చేపలు, రొయ్యల చెరువులు విచ్చలవిడిగా, అక్రమంగా తవ్వుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. స్వయంగా స్థానిక ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరావు ఆధ్వర్యంలోనే చేపల చెరువులు అక్రమంగా తవ్వడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికే చేపల చెరువుల నీటిలో ఉప్పు కలిపి కలుషితం చేసి తాగునీరు లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మండవల్లి మండలం కానుకూరు గ్రామంలో దళితులు, పేదలు గత పది రోజుల నుంచి చెరువులు తవ్వడానికి వ్యతిరేకంగా పోరాడుతున్నా కనీసం స్థానిక ఎంఎల్‌ఎ పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. మండల అధికారుల సమక్షంలోనే ఈ అక్రమాలకు పాల్పడుతున్నా జిల్లా ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి మండలం చించినాడ గ్రామం పెరుగులంక భూముల్లో అక్రమ తవ్వకాలపై ప్రశాంతంగా ఆందోళన చేస్తున్న దళితులపై లాఠీఛార్జీ చేసి, అక్రమంగా అరెస్టు చేయడాన్ని సంఘం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ప్రభుత్వ చీఫ్ విప్ ప్రసాదరాజు అండతో చేస్తున్న అక్రమ తవ్వకాలను ఆపాలని డిమాండ్ చేశారు. చించినాడ గ్రామం పెరుగులంక భూములు 380 దళిత బిసి, పేద కుటుంబాలు పట్టాలు పొంది 40 ఏళ్ల నుండి సాగు చేసుకుంటున్నారని, ఈ భూముల్లో ఇసుక అక్రమ తవ్వకాలు ఆపాలని దళితులు న్యాయబద్ధంగా గత కొన్నేళ్లుగా ఆందోళన చేస్తున్నారని, ఈ భూముల్లో తవ్వకాలు చేపట్టకుండా హైకోర్టు ఆదేశాలున్నప్పటికీ ప్రసాదరాజు అండతో చట్టాన్ని ధిక్కరించి తవ్వకాలు కొనసాగిస్తున్నారని, ఈ అక్రమ తవ్వకాలకు పోలీసు, ప్రభుత్వ యంత్రాంగం వత్తాసు పలుకుతోందని విమర్శించారు. ప్రసాదరాజు చించినాడ ప్రజలు, దళితులపై కక్షకట్టి వ్యవహరిస్తున్నారని, ఇతర ప్రభుత్వ భూములున్నప్పటికీ కాంట్రాక్టర్‌కు మట్టిని అక్రమంగా కట్టబెట్టేందుకు ప్రభుత్వం పూనుకుంటున్నదని, దీనివల్ల గోదావరి గట్టుకు ప్రమాదం ఉందని, వరదల్లో కట్టతెగి పొలాలపైకి నీళ్లు వస్తే అందుకు ప్రభుత్వ యంత్రాంగమే బాధ్యత వహించాలన్నారు.

మట్టి తవ్వుతారనే ఆందోళనతోనే ఐదో తేదీ రాత్రంతా పేదలంతా లంకల్లోనే నిద్రించారని, శాంతియుతంగా ఆందోళన చేస్తున్న పేదలపై పోలీసు యంత్రాంగం లాఠీఛార్జీ చేసి స్థానిక ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడుతో సహా సుమారు 30 మందిని అరెస్టు చేయడం అన్యాయమని, కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించి పేదలపై, మహిళలపై దౌర్జన్యానికి పూనుకోవటం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. భూముల కోసం పోరాడుతున్న ప్రజలకు సంఘీభావంగా రాబోయే కాలంలో పోరాటానికి సిద్ధమవుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎ.రవి, తామా ముత్యాలమ్మ, ఎస్.మహంకాళిరావు, సహాయ కార్యదర్శులు తుమ్మల సత్యనారాయణ జిల్లా కమిటీ సభ్యులు ఎ.ప్రభాకర్, వై.సీత, మాధవ పాల్గొన్నారు.

హనుమాయమ్మ హత్య దారుణం

ఆమె కుటుంబానికి రూ.50 లక్షల పరిహారమివ్వాలి

ప్రజాశక్తి - ఏలూరు

ప్రకాశం జిల్లాలో అంగన్‌వాడీ కార్యకర్తను హత్య చేసిన వైసిపి కార్యకర్తను కఠినంగా శిక్షించాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక వసంతమహల్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె.విజయలక్ష్మి, పి.హైమావతి మాట్లాడుతూ హనుమాయమ్మను రాజకీయ కక్షతో అతిదారుణంగా ట్రాక్టర్‌తో ఢీకొట్టి చంపిన వైసిపి కార్యకర్త కొండలరావును అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని, హనుమాయమ్మ కుటుంబానికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, ఆమె కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, అంగన్వాడీలపై రాజకీయ కక్ష సాధింపు చర్యలు ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు టి.రజని, టి.సుకన్య, కె.కనకదుర్గ, జి.విజయలక్ష్మి, ఎం.రాజేశ్వరి, డి.దుర్గాదేవి, బి.విశాల, సిహెచ్.ఆందోళనమ్మ, ఎస్‌కె.షమ్మీ పాల్గొన్నారు.

ఏలూరులో ఆందోళన చేస్తున్న ఐద్వా నేతలు

చింతలపూడి :ప్రకాశం జిల్లా రావివారిపాలెంలో వైసిపి నాయకుడి దాడిలో ప్రాణాలు కోల్పోయిన అంగన్‌వాడీ కార్యకర్త హనుమాయమ్మకు వైసిపి ప్రభుత్వం రూ.50 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని సిఐటియు మండల అధ్యక్షులు నత్త వెంకటేశ్వరావు, అంగన్‌వాడి ప్రాజెక్టు అధ్యక్షురాలు సరోజని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని అంగన్‌వాడీ ప్రాజెక్టు వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం వినతిపత్రాన్ని ఐసిడిఎస్ సూపర్‌వైజర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకాశం జిల్లా టంగుటూరి ప్రాజెక్ట్ రావివారిపాలెం గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త హనుమాయమ్మను రాజకీయ కక్షతో వైసిపి నాయకుడు కొండలరావు ట్రాక్టర్‌తో తొక్కించి హత్యచేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె కుటుంబంలో ఒకరికి వెంటనే ఉద్యోగం ఇవ్వాలని, కొండలరావును కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధ్యక్షురాలు ఎన్.సరోజని, జి.సరళ, ఎం.అరుణకుమారి, డి.హేమలత, వి.శ్యామల, కస్తూరి, చెన్నకేశ్వరి పాల్గొన్నారు.

చెరువు తవ్వకం ఆపాలని గ్రామస్తుల ధర్నా

ప్రజాశక్తి - కలిదిండి

చేపల చెరువు తవ్వకం పనులు నిలుపుదల చేయాలని కోరుతూ గ్రామస్తులు ఎస్‌ఆర్‌పి అగ్రహారం వద్ద రాష్ట్రీయ రహదారిపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. మండలంలోని ఎస్‌ఆర్‌పి అగ్రహారంలోని మంచినీటి చెరువు పక్కనే చేపల చెరువు అక్రమ తవ్వకం వల్ల తాగునీటి చెరువు కలుషితమవుతుందన్నారు. తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తే రెండు, మూడు రోజులు పనులు నిలుపుదల చేశారని, మళ్లీ తిరిగి తవ్వకం పనులు చేపట్టారని అన్నారు. నాయకుల అండదండలతో స్థానిక అధికారులు చెప్పినా వినకుండా తవ్వకం పనులు చేపట్టారన్నారు. మంచినీటి చెరువును కాపాడాలని, ఎంఎల్‌ఎ వెంటనే స్పందించి చేపల చెరువు తవ్వకం ఆపాలని డిమాండ్ చేశారు. రాష్ట్రీయ రహదారిపై ఇరువైపులా ట్రాఫిక్ నిలిచిపోవడంతో ఎస్ఐ మణికుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని, సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని వారికి నచ్చజెప్పారు. దీంతో రాష్ట్రీయ రహదారిపై చేస్తున్న వారంతా తహశీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. ఎస్‌ఆర్‌పి అగ్రహారం నుండి గ్రామస్తులు ర్యాలీగా తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని బైఠాయించారు. తహశీల్దార్ తేజోమణికి ఎస్ఐ మణికుమార్ సమక్షంలో పరిస్థితిని వివరించారు.

చించినాడలో యాత్రను ప్రారంభిస్తున్న సూర్యనరాయణ

కౌలు రైతులకు విరివిగా పంట రుణాలివ్వాలి

కౌలురైతు రక్షణ యాత్రలో నేతలు

ప్రజాశక్తి - పశ్చిమయంత్రాంగం

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన కౌలు రైతుల చట్టాన్ని సవరించి, కౌలురైతులకు విరివిగా పంట రుణాలివ్వాలని ఎపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సూర్యనారాయణ, ఎపి కౌలురైతుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.బాలకృష్ణ కోరారు. ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన కౌలు రైతు రక్షణ జీపు యాత్ర శుక్రవారం జిల్లాలోకి యలమంచిలి మండలం చించినాడ వద్ద ప్రవేశించింది. ఈ సందర్భంగా జిల్లాలో యాత్రను సూర్యనారాయణ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం యాత్ర చించినాడ, యలమంచిలి, గుంపర్రు, కాంబొట్లపాలెం, వల్లూరు, ఆచంట, ములపర్రు, తామరాడచెరువు, పెనుగొండ, ఇరగవరం, కొత్తపాడు, జుత్తిగ, మంచిలి, అత్తిలి, పిప్పర మీదుగా రాత్రికి గణపవరం చేరుకుంది. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో నేతలు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలన్నీ భూయజమానులకే దక్కుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కౌలు గుర్తింపు కార్డుల కోసం భూయజమానులు సంతకం పెట్టడం లేదని, కౌలు రైతులకు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూయజమాని సంతకం నిబంధన తొలగించి కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పెట్టుబడి సాయం కింద రూ.25 వేలు ఇవ్వాలని, భూమిలేని కౌలు రైతులకు భరోసా కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ విధానాలతో కౌలురైతులకు గుర్తింపు దక్కడం లేదని వాపోయారు. ప్రభుత్వం కౌలు రైతులకు సాగు రుణాలు ఇవ్వకపోవడంతో అధిక వడ్డీలకు అప్పు తెచ్చుకుని సాగు చేసి అప్పుల పాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కౌలు రైతుల కష్టాలు తీరాలంటే కౌలు రైతుల చట్టాన్ని పూర్తిగా మార్చాలన్నారు. కౌలు రైతుల సమస్యలపై ఈ నెల 12న విజయవాడలో జరిగే మహా పాదయాత్రలో కౌలు రైతులందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కూసంపూడి సుబ్బరాజు, మామిడిశెట్టి రామాంజనేయులు, నాయకులు వద్దిపర్తి అంజిబాబు, సిర్రా నరసింహమూర్తి, పిల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

మట్టి దందా.. ఆపేదుందా..!

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పట్టణ పరిసరాల్లో మట్టి అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. అధికార పార్టీకి చెందిన ఓ వ్యక్తి ఈ మట్టిదందాకు పాల్పడుతున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. అంతేకాక ఆ వ్యక్తిని 'శంకర్‌దాదా.. మట్టిదందా..' అంటూ పలువురు వ్యంగ్యంగా చెప్పడం విశేషం. అధికార పార్టీ ముసుగులో కొండగుట్టలను గుల్ల చేసిన ఈ మట్టిభకాసురుడు నేడు అధికార పార్టీ నాయకుల పేరు చెప్పుకుంటూ అధికారులను సైతం లెక్కచేయకుండా యర్రకాలువ శలాశయంలో అడ్డగోలు తవ్వకాలకు బరితెగించాడని ప్రజలు బహిరంగంగా చెబుతున్నారు. జగనన్న కాలనీ ఇళ్లకు మట్టి రవాణా చేసే ముసుగులో అధికార పార్టీ నాయకుల ద్వారా తీసుకున్న అనుమతులతో ప్రయివేటు స్థలాలు, లేఅవుట్‌లకు మట్టిరవాణా చేస్తున్న ఈ 'శంకర్‌దాదా.. మట్టిదందా' వల్ల ప్రభుత్వానికి అప్రతిష్ట కలుగుతుందని అధికార పార్టీ ప్రజాప్రతినిధులు గ్రహించాలని స్తానికులు కోరుతున్నారు.

ఇటీవల యర్రకాలువ జలాశయం నుండి రాత్రీపగలు తేడా లేకుండా మట్టిరవాణా చేయడంతో విసుగుచెందిన వేగవరం, చక్రదేవరపల్లి గ్రామస్తులు, ప్రజా సంఘాలు యర్రకాలువ జలాశయంలో మట్టిదందాను అరికట్టాలని కోరుతూ స్పందనలో ఫిర్యాదులు అందించారు. అయినప్పటికి అడ్డగోలు మట్టిదందాను అరికట్టడంలో రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్ అధికారులు విఫలమవుతున్నారని బహిరంగంగా విమర్శలు గుప్పిస్తున్నారు. స్థానిక ఎంఎల్‌ఎ ఉన్నమట్ల ఎలిజా పలు సందర్భాల్లో నిబంధనలకు విరుద్ధంగా రాత్రి సమయంలో మట్టిరవాణా చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరికలు జారీ చేశారు. అయినప్పటికీ మట్టి దందాను అరికట్టలేకపోవడం, అధికారుల ఉదాశీనవైఖరికి అద్దం పడుతుందని ప్రజలు విమర్శిస్తున్నారు. ఫిర్యాదులు ఎక్కువ అవుతున్న తరుణంలో నామమాత్రంగా ఒకటి, రెండు వాహనాలపై నామమాత్రంగా కేసులు నమోదు చేయడం తప్ప ఎలాంటి కఠిన చర్యలు తీసుకున్న సందర్భాలు లేవన్నారు. ఈ నేపథ్యంలో ఒకవైపు ప్రజాప్రతినిధులకు, మరోవైపు అధికారులకు ప్రలోభాలు, మామూళ్లు అందిస్తున్న ఈ శంకర్‌దాదాపై ఉన్నతాధికారులు దృష్టిసారించాలని, ప్రభుత్వ ప్రతిష్ఠకు భంగం కలుగకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. యర్రకాలువ జలాశయంలో మట్టి అక్రమ తవ్వకాలపై ఇరిగేషన్ ఎఇ బాస్కరరావును వివరణ కోరగా కాలనీ ఇళ్లకు మాత్రమే మట్టి రవాణాకు అనుమతులు పొందారని తెలిపారు. రాత్రి సమయంలో మట్టి రవాణాకు అనుమతివ్వలేదని తెలిపారు.

యర్రకాలువ జలాశయంలో
అడ్డగోలుగా మట్టితవ్వకాలు
కాలనీ ఇళ్ల ముసుగులో
లే అవుట్లకు తరలింపు
స్పందనలో ఫిర్యాదు చేసినా పట్టని
అధికారులు

మట్టిని తరలిస్తున్నలారీలు

హమాలీల కూలిరేట్లు 15 శాతం పెంపు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరులోని వివిధ షాపుల్లో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు 15 శాతం కూలి రేట్లు పెంచుతూ ఒప్పందం సాధించుకున్నారు. శుక్రవారం ఏలూరు మర్చంట్ ఛాంబర్ మధ్యవర్తిత్వంలో వ్యాపారస్తులకు, కార్మిక సంఘాలకు మధ్య జరిగిన చర్చల్లో ఈ మేరకు ఒప్పందం కుదిరిందని ఐఎఫ్‌టియు, ఎఐటియుసి నాయకులు తెలిపారు. గతంలో జరిగిన కూలిరేట్ల ఒప్పందం గతనెల తొమ్మిదో తేదీతో ముగిసింది. అంతకుముందే ఎఐటియుసి అనుబంధ జట్లు, లాగుడు బండ్ల కార్మిక సంఘం, ఐఎఫ్‌టియు అనుబంధ ఏలూరు హమాలీ, జుట్టు కార్మిక సంఘం విడివిడిగా ఛాంబర్ నాయకత్వానికి నోటీసులిచ్చారు. అయితే ఛాంబర్ నాయకత్వం జాయింట్ సమావేశం ఏర్పాటు చేయడంలో ఆలస్యం చేయడంతో కార్మికులు యజమానుల షాపుల వద్ద నిరసన తెలిపారు. దీంతో ఛాంబర్ పెద్దలు అత్యవసరంగా సమావేశం నిర్వహించారు. రెండు దఫాలుగా చర్చలు జరిగాయి. చివరికి శుక్రవారం జరిగిన చర్చల్లో ఒప్పందం కుదిరింది. ప్రస్తుతం ఇస్తున్న కూలిరేట్లపైన 15శాతం పెంపుదలకు ఇరువురూ అంగీకరించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి నాయకులు పి.కన్నబాబు, ఐఎఫ్‌టియు నాయకులు గడసాల రాంబాబు మాట్లాడుతూ మొదట ఆలస్యం చేసినప్పటికీ చివరికి యజమానులు సామరస్యంగా ఒప్పందానికి ముందుకు వచ్చారని తెలిపారు.

ఈ ఒప్పందం సాధించుకోవడంలో పట్టుదల ప్రదర్శించిన ఇరు సంఘాలు కార్మికవర్గానికి ధన్యవాదాలు తెలిపారు. కార్మికులు సంఘటితంగా, ఐక్యంగా ఉండటం వల్లే కూలిరేట్లు పెరిగాయన్నారు. ఇదే ఐక్యతను కార్మికులు ఎల్లవేళలా కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ చర్చల్లో ఛాంబర్ తరపున అధ్యక్షులు నేరెళ్ల రాజేంద్ర, ఉపాధ్యక్షులు దింటకుర్తి వీర్రాజు, సెక్రటరీ వంకాయల రామకృష్ణ, వ్యాపారస్తులు బ్రహ్మయ్య, కార్మికుల తరపున ఐఎఫ్‌టియు నాయకులు యు.వెంకటేశ్వరరావు, బద్దా వెంకట్రావు, ఎఐటియుసి తరపున బండి వెంకటేశ్వరరావు, మారిన వెంకట్రావు, పుప్పాల కన్నబాబు, ఎఐటిసి అనుబంధ జట్లు, లాగుడు బండ్ల కార్మిక సంఘం సెక్రటరీ వంగలపూడి గంగరాజు, ట్రెజరర్ పెచ్చెట్టి శ్రీను పాల్గొన్నారు.

ప్రజాసేవకు ప్రాధాన్యతివ్వాలి : జయమంగళ

ప్రజాశక్తి - కైకలూరు

మాట్లాడుతున్న జయమంగళ వెంకటరమణ

సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు ప్రజలకు అందుబాటులో ఉంటూ చేతనైనంత సేవలు అందించాలని అప్పుడే ప్రజలు గుర్తుపెట్టుకుంటారని ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం ఎంపిపి అడవి కృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. కొల్లేటికోట, చింతపాడు పాఠశాలల్లోని పదోతరగతి విద్యార్థులు పరీక్షలు రాయడానికి చాలా దూరం ప్రయాణించాల్సి వస్తుందన్నారు. కనీసం వచ్చే ఏడాది అయినా అదే పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు తనవంతు కృషి చేస్తానన్నారు. ఎంఎల్‌ఎ నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఈ ఏడాది సీజన్‌లో కాలువలకు సాగునీటిని సరఫరా చేసి రికార్డు నమోదు చేసిందన్నారు. రైతులకు, ప్రజలకు నీటి కష్టాలు లేవన్నారు. అధికారులు ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ పనులు పూర్తి చేయాలన్నారు. జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించే పనులు ముమ్మరంగా సాగుతున్నాయని తెలిపారు. అధికారులు వారివారి శాఖలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు కురెళ్ల బేబీ, కైకలూరు సర్పంచి మేరినవరత్నకుమారి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు జహీర్, ఎంపిడిఒ రామకృష్ణ పాల్గొన్నారు.

రైతులకు 'యాజమాన్య హక్కు పత్రాలు'

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మాట్లాడుతున్న సర్పంచి నాగేంద్రబాబు

భూముల రీ సర్వే ద్వారా యాజమాన్య హక్కు కార్డులు పొందాలని అక్కంపేట గ్రామ సర్పంచి పారేపల్లి నాగేంద్రబాబు తెలిపారు. శుక్రవారం మండలంలోని అక్కంపేట గ్రామ పంచాయతీ వద్ద చేపట్టినరీ సర్వే తుది జాబితా కోసం గ్రామ సర్పంచి పారేపల్లి నాగేంద్రబాబు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నివాసస్థలం యజమానులకు శాశ్వత యాజమాన్య హక్కులు కల్పించి వారి ప్రయోజనాలు కాపాడేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న శాశ్వత భూ హక్కు - రీసర్వే కార్యక్రమం అక్కంపేటలో తుదిదశకు చేరడం శుభ పరిణామమన్నారు. ఇప్పటి వరకూ సర్వేకు సహకరించిన గ్రామస్తులకు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. ఎంపిడిఒ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఇప్పటి వరకు సర్వే సమర్థ నిర్వహణకి సహకరించిన గ్రామస్తులను, సిబ్బందిని అభినందిస్తూ గ్రామాభివృద్ధికి సహకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు కె.రమేష్ బాబు, ఇఒపిఆర్‌డి, అర్‌డి సునీల్ కుమార్, ఉపసర్పంచి వింజమూరి కిరణ్ కిషోర్ పాల్గొన్నారు.

ప్రజాసమస్యలకు సత్వర పరిష్కారం చూపండి

ప్రజాశక్తి - మండవల్లి

ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలకు పరిష్కారం చూపి మండల అభివృద్ధికి కృషి చేయాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు సుధామ ఫౌండేషన్ అధినేత ప్రొఫెసర్ సుధాబత్తుల విజయకుమార్ తహశీల్దార్ కె.రాజ్‌కుమార్‌ను, ఎంపిడిఒ పికె.వెంకటరమణను కోరారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన అధికారులను వారి కార్యాలయాల్లో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి సింధూరం మొక్కలను బహుమతిగా అందించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి మూలమైన గ్రామసభలను సమర్థవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకుని గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అంతేకాకుండా గ్రామ సభల్లో అధికారులు అందరూ పాల్గొనేలా చర్యలు తీసుకుని ప్రజలను సమీకరించి విజయవంతంగా సభలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలను చైతన్య పరచాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు కొల్లేరు సరస్సు అభివృద్ధికి, కొల్లేరును కాలుష్యం నుండి రక్షించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో మండలంలోని అధికారులంతా పాల్గొనేలా చూడాలని కోరారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అనంతరం కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటి ఎదిగేవరకూ పరిరక్షించాలని వారిని కోరారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు టి.అప్పారావు పాల్గొన్నారు.

నూకాలమ్మకు బంగారు నేత్రాల బహూకరణ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక నూకాలమ్మ ఆలయంలో అమ్మవారి అలంకరణకు దాతలు బంగారు నేత్రాలను బహూకరించారని ఆలయ ఛైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఆలయానికి వచ్చిన పోలుకొండ లలిత కుమారి, హర్షవర్ధని సుమారు రూ.56 వేల విలువ కలిగిన బంగారు నేత్రాలను అమ్మవారి అలంకరణకు అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు


వినతిని అందిస్తున్న అందిస్తున్న స్కూల్ స్వీపర్లు

నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించండి

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రభుత్వ పాఠశాలల స్వీపర్లను, ఆయాలను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని ఎఐటియుసి చింతలపూడి ఏరియా కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు, అధ్యక్షులు తొర్లపాటి బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంపిడిఒ మురళీకృష్ణకు శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం ఎనిమిది గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు పాఠశాలల్లో మరుగుదొడ్లు శుభ్రం చేస్తూ, మొక్కలకు నీరుపోస్తూ గొడ్డుచాకిరీ చేస్తున్న వీరిని విస్మరించడం అన్యాయమన్నారు. వీరికి కనీస భద్రత లేకుండా పోయిందన్నారు. కనీసం వారికి సెలవులు కూడా ఇవ్వడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో కన్నమ్మ, జ్యోతి, బూసమ్మ, లక్ష్మి, రూతమ్మ, కృష్ణకుమారి పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న నాయకులు

జ్యూట్ కార్మికులను రోడ్డు పాల్జేశారు

యాజమాన్య వైఖరిని నిరసిస్తూ ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు శ్రీకృష్ణ జ్యూట్ మిల్లును చట్టవిరుద్ధంగా 16 నెలలుగా మూసివేసి, కార్మికులను రోడ్డు పాలు చేసి, రియల్ ఎస్టేట్ వ్యాపారానికి దిగుతూ, కార్మికులకు న్యాయం చేయకుండా ఇబ్బంది పెడుతున్న యాజమాన్య వైఖరిని ఖండిస్తూ ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో శుక్రవారం ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు మాట్లాడుతూ సుమారు రూ.250 కోట్ల విలువ చేసే మిల్లు ఆస్తులపై రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకునే మేనేజ్‌మెంట్ రూ.ఐదారు కోట్లు కార్మికులకు చెల్లించడానికి ముందుకు రాకుండా ఇబ్బంది పెడుతున్నారని విమర్శించారు. చట్ట ప్రకారం 19 నెలల జీతం, డబుల్ గ్రాట్యుటీ రావాలని కానీ సంఘాలు ఎంతో సంయమనంతో వ్యవహరించి నాలుగు నెలల జీతం, ఏడాదికి రూ.4,500 పరిహారం కోరినప్పటికీ యాజమాన్యం ముందుకు రాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. కార్మికుల ఆకలి బాధలను అడ్డంపెట్టుకుని మేనేజ్‌మెంట్ ఆటలాడుతుందని విమర్శించారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. లేని పక్షంలో భవిష్యత్తులో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు నగర అధ్యక్షులు కర్ర అప్పారావు, నగర ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు, నగర నాయకులు రమణ, శ్రీనివాసరావు, ఎం.రాము, శివశంకర్, బి.భద్రం, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు కె.నాని, నగర అధ్యక్షులు ఎం.క్రాంతి పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు

ప్రజాశక్తి - కైకలూరు

సీతనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. వైద్యాధికారి హేమలత ఆధ్వర్యంలో 50 మంది గర్భిణులకు పరీక్షలు చేశారు. వీరిలో ఏడుగురిని హై రిస్క్ గర్భిణులుగా గుర్తించి వారికి ఐరన్ ఫోలిక్ ఆసిడ్, కాల్షియం సప్లిమెంట్స్ అందించారు. ఈ కార్యక్రమానికి వచ్చిన గర్భిణులకు వారి సహాయకులకు శ్రీసత్య సాయి సేవా సంఘ సభ్యులు భోజన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో మూర్తి, శ్రీనివాసరావు, కనకదుర్గ, లక్ష్మి కుమారి సత్య సాయి సమితి సభ్యులు వీరప్ప, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఉపాధి పనుల తీరుపై విచారణ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని 2022-23లో ఉపాధి హామీ చట్టంలో 29 గ్రామాల్లో రూ.17 కోట్ల విలువైన పనులు చేపట్టామని ఎపిఒ సోమేశ్వరి తెలిపారు. ఈ పనుల తీరుపై సామాజిక తనిఖీ బృందాలు శుక్రవారం నుండి గ్రామాల్లో పర్యటిస్తున్నాయి. కూలీలతో మాట్లాడి నగదు సక్రమంగా అందుతుందీ, లేనిదీ అడిగి తెలుసుకుంటున్నారని, కొలతల ప్రకారం పనులు చేశారా లేదా? అనేది పరిశీలిస్తున్నారని ఎపిఒ తెలిపారు.

సామాజిక ఆసుపత్రికి ఎసి వితరణ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

స్థానిక కరాటం రంగనాయకమ్మ సామాజిక ఆసుపత్రికి రోగుల సౌకర్యార్థం డిసిసిబి మాజీ ఛైర్మన్ కరాటం రాంబాబు ఎసి బహూకరించారు. ఆసుపత్రిలోని ఫిజియోథెరపీ వార్డులో రోగుల సౌకర్యార్థం శుక్రవారం సుమారు రూ.40 వేల విలువైన ఏసీని అందించారు. ఏజెన్సీ ప్రాంతంలో తొలినాళ్లల్లో ఈ ఆసుపత్రి ఏర్పాటులో కరాటం రాంబాబు తండ్రి కరాటం చంద్రయ్య ఆర్థికంగా, సాంకేతికంగా కీలకపాత్ర పోషించారు. కరాటం కుటుంబీకులు ఆసుపత్రికి అవసరమైన ఇన్వర్టర్, ఆర్ఒ వాటర్ ప్లాంట్ వంటి వివిధ విలువైన పరికరాలను సమకూర్చి, ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేయడం విశేషం. ఏసీ రోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆసుపత్రి వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యాధికారులు కిషోర్ నాయక్, హేమంత్, సుమ (ఫిజియోథెరపిస్ట్) పాల్గొన్నారు.


పరీక్షలు చేస్తున్న వైద్యులు

సర్పంచి సౌజన్యంతో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - ముసునూరు

కాట్రేనిపాడు సర్పంచి గద్దల సుహాసిని సౌజన్యంతో గ్రామంలో శుక్రవారం ఉచిత వైద్యశిబరం ఏర్పాటు చేశారు. స్థానిక జిల్లా పరిషత్ వున్నత పాఠశాలలో టిడిపి నాయకులు రాపర్ల ప్రతాప్, రాపర్ల బాలకృష్ణ ఆధ్వర్యంలో పుణ్యా ఛారిటీస్, చినఆవుటుపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కాలేజి సహకారంతో బిపి, షుగర్, ఆర్థోపెడిక్, ఎముకలు, కీళ్లు, గుండెకు సంబంధించిన ఇసిజి సదుపాయాలతో పాటు నేత్ర సమస్యలు, చర్మవ్యాధుల పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులు అందించారు.

నేరాలు - ఘోరాలు

కోడిపందేల స్థావరంపై దాడి

ప్రజాశక్తి - టి.నరసాపురం

కోడి పందేలు నిర్వహిస్తున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ కె.సతీష్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం బొర్రంపాలెం గ్రామ శివారులో కోడి పందేలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో శుక్రవారం దాడి చేశామన్నారు. నిర్వాహకుల నుండి రెండు కోడిపుంజులు, రెండు కోడి కత్తులు, రూ. 9670 నగదు, నాలుగు మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

12 నుండి గురుకులంలో ప్రవేశాలు

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని అప్పలరాజుగూడెం గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో చేరేందుకు ఎంపికైన విద్యార్థులకు ఈ నెల 12వ తేదీ నుండి ప్రవేశం కల్పిస్తున్నామని ప్రిన్సిపల్ టి.నరసింహస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎపి గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో గురుకుల పాఠశాలల్లో 5, 6, 7, 8 తరగతుల్లో మిగిలివున్న సీట్లకు గురుకుల జూనియర్ కళాశాల మొదటి సంవత్సరం ఇంటర్ సీట్లకు జనరల్ గురుకుల డిగ్రీ కళాశాలల్లో మొదటి సంవత్సరం డిగ్రీ సీట్లకు 2023-24 విద్యా సంవత్సరానికి ప్రవేశానికి గతనెల 20వ తేదీన నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలు ఈ నెల ఎనిమిదో తేదీన విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను http//:aprs.apcfss.in వెబ్‌సైట్‌లో ఉంచామని ఆయన తెలిపారు. ప్రవేశపరీక్ష రాసిన విద్యార్థుల ఫలితాలను విద్యార్థి ఐడి, హాల్‌టిక్కెట్ నంబరు ద్వారా వెబ్‌సైట్ నుండి తెలుసుకోవచ్చని ఆయన తెలిపారు.

ఎంఎల్‌ఎను కలిసిన అధికారులు

ప్రజాశక్తి - కైకలూరు

నియోజకవర్గంలో పలు ప్రభుత్వ శాఖల్లో నూతనంగా విధుల్లో చేరిన అధికారులు ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావును శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నందిగామ ఆర్‌డిఒ కార్యాలయంలో పరిపాలనాధికారిగా పనిచేస్తూ మండవల్లి తహశీల్దార్‌గా బదిలీపై వచ్చిన కె.రాజ్‌కుమార్, కృష్ణా జిల్లా పరిషత్ కార్యాలయంలో పరిపాలనాధికారిగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై కలిదిండి ఎంపిడిఒగా వచ్చిన వి.రాంబాబు, నిడమర్రు ఎపిఎంగా పనిచేస్తూ మండవల్లి ఎపిఎంగా వచ్చిన జి.రాజశ్రీ, మచిలీపట్నం జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో డిటిగా పనిచేస్తూ కలిదిండి రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్‌గా వచ్చిన టిఎన్‌ఎస్.కిరణ్‌కుమార్ ఎంఎల్‌ఎ ఇంటి వద్ద మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందించి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఎంఎల్‌ఎ వారికి సూచించారు.

ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మలేరియా నివారణోత్సవాలను పురస్కరించుకుని నూజివీడు పట్టణంలోని కోనేరుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. దీనిలో భాగంగా వైద్యులు, సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమల నిర్మూలనకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి కె.సౌమ్య, సబ్ యూనిట్ ఆఫీసర్ యలమంద పాల్గొన్నారు.

అధికారులకు సన్మానం

ప్రజాశక్తి - పోలవరం

నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపిడిఒ జి.శ్రీనును, ఇక్కడ ఇఒపిఆర్‌డిగా పనిచేసి బదిలీపై జీలుగుమిల్లి ఇఒపిఆర్‌డిగా వెళ్తున్న నిఖిల్ మధును, నాలుగేళ్లు ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా పనిచేసిన సిహెచ్.శ్రీనివాసబాబును అధికారులు, సిబ్బంది శుక్రవారం ఘనంగా సన్మానించారు. అలాగే ఎంపిపిల సంఘం జిల్లా అధ్యక్షులుగా ఎంపికైన పోలవరం ఎంపిపి సుంకర వెంకట్‌రెడ్డిని ఎపి ఎన్‌జిఒ సంఘం తరపున సత్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు కలుం హేమకుమారి, వైస్‌ఎంపిపి శ్రీదేవి, ఎంపిటిసి వలవల వరలక్ష్మి, వైసిపి మండల కన్వీనర్ బుగ్గ మురళీకృష్ణ, సర్పంచులు, కార్యదర్శులు, గ్రేడ్-5 సెక్రటరీలు, ఎపి ఎన్‌జిఒ సంఘం ఉద్యోగులు పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న రాజశేఖర్

రక్తదానంలో ఆదర్శం.. రాజశేఖర్

ప్రజాశక్తి - పోలవరం

ఎపిఎస్‌పిఎఫ్ హెడ్ కానిస్టేబుల్ పంతాడ రాజశేఖర్ మరోసారి రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. ఇప్పటి వరకూ ఆయన 45సార్లు రక్తదానం చేశారు. రాజమండ్రి కిమ్స్ ఆసుపత్రిలో గుండె ఆపరేషన్ చేయించుకుంటున్న మండలానికి చెందిన గన్నవరపు పోసియ్యచార్యులుకు 'ఒ' పాజిటివ్ బ్లడ్ అవసరం నిమిత్తం రాజమండ్రిలో ఉన్న జక్కంపూడి బ్లడ్ బ్యాంకులో రాజశేఖర్ రక్తదానం చేశారు.

తహశీల్దార్ కార్యాలయంలో పలువురు బదిలీ

ప్రజాశక్తి - ముసునూరు

తహశీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ ఆశోక్ ఉద్యోగోన్నతిపై నూజివీడు ఆర్ఐగా బదిలీయ్యారు. బలివే విఆర్ఒ రవిబాబు ఆగిరిపల్లి మండలంలోని అడవినెక్కలం విఆర్ఒగా బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో ఆడవినెక్కలం నుండి బలివే గ్రామానికి విఆర్ఒగా మునేంద్ర బాధ్యతలు చేపట్టారు. తహశీల్దార్ కార్యాలయ అటెండర్ నరసింహారావు నూజివీడు తహశీల్దార్ కార్యాలయానికి బదిలీయ్యారు. ఇలా పలువురు అధికారులు బదిలీ అయినట్లు తహశీల్దార్ దాసరి సుధ తెలిపారు.

బహూకరించిన బంగారు నేత్రాలు

శ్రీవైష్ణవి కళాశాలను సీజ్ చేయాలి: పిడిఎస్‌యు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అనుమతులు లేకుండా అడ్మిషన్లు నిర్వహిస్తున్న ఎన్ఆర్.పేటలోని శ్రీవైష్ణవి జూనియర్ కళాశాలను సీజ్ చేయాలని పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు కాకినాని డిమాండ్ చేశారు. ఈ మేరకు కోటదిబ్బ డిగ్రీ కళాశాల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్లకార్డులతో నిర్వహించిన ప్రదర్శనలో నాని మాట్లాడారు. ఈ కళాశాలకు కనీస అనుమతులు లేకుండా ఎస్‌విఆర్‌కె కళాశాల యాజమాన్యం బోర్డులు తగిలించి అడ్మిషన్లు చేపడుతున్న ఆర్ఐఒ చంద్రశేఖర్‌బాబు నుంచి ఎలాంటి స్పందనా లేదని తెలిపారు. ఈనెల ఒకటో తేదీన ఆర్ఐఒకు ఈ కళాశాలపై చర్యలు కోరుతూ వినతిపత్రం ఇచ్చామని, ఆయన కావాలని తాత్సారం చేసి నాలుగో తేదీన యాజమాన్యానికి షోకాజ్ నోటీస్ ఇచ్చారన్నారు. దీనిపై యాజమాన్యం చాలా నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చిందని, అయినప్పటికీ బోర్డు తీయకుండా అడ్మిషన్లు చేపడుతున్న విషయాన్ని ఆర్ఐఒ దృష్టికి తీసుకెళ్లి ఫోన్‌చేసి సమాధానం అడిగేందుకు ప్రయత్నిస్తే ఫోన్లు లిఫ్ట్ చేయడం లేదని, స్వయంగా పిడిఎస్‌యు నాయకులు వెళ్లి సమాధానం అడిగితే 'మీరేం చేసుకుంటారో చేసుకోండి' అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీన్నిబట్టి చూస్తే ఆయనకు పెద్దఎత్తున ముడుపులు అందాయని అనుమానం వస్తుందన్నారు. విధి నిర్వహణలో అలసత్వంవహిస్తూ ప్రయివేటు యాజమాన్యానికి తొత్తులుగా మారిన ఆర్ఐఒను తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు ఎం.క్రాంతి, నగర కమిటీ సభ్యులు దుర్గాప్రసాద్, డిగ్రీ కాలేజి కమిటీ సభ్యులు సునీల్, బాల రాజాజీ పాల్గొన్నారు.

ఎపిఆర్‌జెసిలో లిటిల్ ఫ్లవర్ విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - ముదినేపల్లి



ఎపి రెసిడెన్సియల్ జూనియర్ కళాశాలల్లో ప్రవేశ పరీక్షల్లో తమ స్కూల్ విద్యార్థి అత్యుత్తమ ప్రతిభ కనబరచినట్లు స్థానిక లిటిల్ ఫ్లవర్ స్కూల్ ప్రిన్సిపల్ బలుసు రఘురామయ్య శుక్రవారం తెలిపారు. తమ స్కూల్ విద్యార్థి జి.రవికిరణ్ గతనెలలో వెలువడిన పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో 586 మార్కులు సాధించి మండలంలో ప్రథమస్థానంలో నిలిచిన రవికిరణ్ ఎపిఆర్‌జెసి ప్రవేశ పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో 178వ ర్యాంక్ సాధించినట్లు తెలిపారు. 150 మార్కులకుగాను రవికిరణ్ 116 మార్కులు సాధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపల్‌తో పాటు, వైస్ ప్రిన్సిపల్ సాయిసుమిత్, ఉపాధ్యాయులు రవికిరణ్‌ను అభినందించారు.

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు **అడపా బాలకృష్ణ గారి భార్య సౌభాగ్యలక్ష్మి,** 3rd Ward, త్రినాథ వీధి, తాడేపల్లిగూడెం, ప॥గో॥జిల్లా - నా క్లయింటుకు సంబంధించి పబ్లిక్ నోటీసు జారీ చేయబడినది.

నా క్లయింటు అడపా సౌభాగ్యలక్ష్మి ఈక్రింది షెడ్యూలు క్రయ దస్తావేజు కంచుమర్తి వెంకట్రావు, S/o. రమణ గార్ల ద్వారా ది. 05-01-1966 తేదీన తాడేపల్లిగూడెం రిజిష్టరు వారి వద్ద క్రయం పొందిన డాక్యుమెంటు నెం. 21/1966. నా భర్త అయిన అడపా బాలకృష్ణ గారితో కలిసి ది. 20-5-2023వ తేదీన బండిపై జిరాక్స్ నిమిత్తం వెళుతుండగా మార్గం మధ్యలో పడిపోయినది. ఆ డాక్యుమెంటు ఎవరికైనా దొరికినను లేక ఎటువంటి అభ్యంతరములు ఉన్ననూ ఈ ప్రకటన ఇచ్చిన ఐదు రోజులలోపు ఈక్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

షెడ్యూలు హద్దులు

ప॥గో॥జిల్లా, తాడేపల్లిగూడెం రిజిష్టర్, తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ, రి.స. నెం. 641, 1/3వ వంతు వాటా అనగా చ॥గ॥ 75.2/3లు ఖాళీ నివేశన స్థలమునకు హద్దులు.

తూర్పు: యీలి పాపయమ్మ గారి స్థలం.
పడమర: అద్దాల సూరన్న గారి స్థలం.
ఉత్తరం: మారిశెట్టి రత్నం గారి ప్రహారీ.
దక్షిణం: వీరాబత్తుల సీత గారి స్థలం.

పమ్మి వి.నాగ వీరభద్రుడు
అడ్వకేట్, తాడేపల్లిగూడెం
ప॥గో॥జిల్లా, సెల్: 7702311197

PUBLIC NOTICE

Under the instructions of my client **ADAPA SOUBHAGYA LAKSHMI,** W/o. Balakrishna, H.No. 1-1-100, 3rd Ward, Trinadha Street, Tadepalligudem, W.G.Dt.

That my client had purchased the below schedule property (75. 2/3) under a Regd. Sale Deed No. 21/1966 from Kanchumarthi Venkata Rao in turn the said Kancumarthi Venkata Rao had purchased the schedule mentioned property under a Regd. Sale Deed No. 21/1966. Which is the Link Document to my client's property that the Original Link Document No. 21/1966 was lost as it was dropped some where on the road during his travel on bike from house to xerox center, Tadepalligudem Local area 20-05-2023. Some was not found after the retured to home. There are this public notice is issued to all that anybody has costady of the said lost original link document No. 21/1966 (or) has claim right or objection over the below schedule property. They shall come forward with documentary proof within five (5) days from the date of this notice to the undersigned else it shall be deemed that there are not claims (or) objections over the below schedule property and the transaction will be proceeded with the claims/ objections received after the above said time, shall not be taken in to consideration and will not bind over my client's right over the below mentioned schedule property.

SCHEDULE

Site measuring an extent of 75. 2/3 s.y together with RCC House D.No. 1-1-100, R.S. No. 641, 3rd Ward, Trinadha Street, Tadepalligudem.
EAST: Site of Eeli Papayamma.
SOUTH: Site of Veerabathula Sitha.
WEST: Site of Addala Suranna.
NORTH: Site of Marisetti Ratnam.

PAMMI V.NAGA VEERABHADRUDU
Advocate, Tadepalligudem
W.G.Dt., Cell: 7702311197